
# చెదురు

## శివల జగన్నాథరావు



కనకాంబరం రంగు పట్టు చీరెలో కాంతాన్ని చూచి నిలువున బిగుసుకు పోయాడు శివరామయ్య. తలంటు కొన్న కురులు ఒదులుగా వేసుకొన్న ముడి. పసుపు రాచుకొన్న ముఖాన కాసంత కుంకుమ బొట్టు కళకళ లాడుతూ కనిపిస్తూంటే, నిండుగా నవ్వుతూ, తన పాదాలకి ఒంగి నమస్కారంపెట్టి లేచిని కాంతాన్ని చూచి శివరామయ్య ఎప్పటిలా ప్రసన్నవదనుడు కాలేకపోయాడు.

భర్తవైఖరి చూచి కాంతం నిశ్చేష్ట అయింది. కాస్సేపు అక్కడే నిలబడి అతనిలో మార్పు రాకపోయేసరికి, ఏమీ అడగటానికి ధైర్యం చాలక, నిట్టూర్చుతూ తనలోనే ఏదో గొణుక్కుంటూ లోపలికి వెళ్ళిపోయింది.

అవాళ కాంతం పుట్టిన దినమట!

కొడుకు విశ్వనాథం చెప్పిన కబురు విని శివరామయ్య 'అలాగా!' అనుకొన్నాడు. కొడుకు కొత్త చీరె కొంటానంటే వద్దని ఆ కనకాంబరం రంగు పట్టు చీరే తీసి కట్టుకొందిట కాంతం. పుట్టిన దినంనాడే కాదు; పండగలకయినా పబ్బాలకయినా, పేరంటకాలకయినా, మనవల బారసాలెలకయినా ఇంట్లో ఏ వేడుక జరిగినా ఆ చీరే పెట్టెలోంచి తీసి కట్టుకొంటుందావిడ. అదంటే ఆవిడికంత ముచ్చట!

పెళ్ళయిన ఏడాది, తొలి పండక్కి తను మనసుపడి కొన్నది, అరచెయ్యి మందాన జరీ అంచు వున్నది, ఆ రాత్రి తమిద్దరి గుండెలోతుల్లోంచి పుటికే వూహాల గుసగుసల్ని చెవులారగించి విన్నది, ఆ చీరె!

రంగు వెలియలేదు. అంచు చెడలేదు. నేత చిమడలేదు. తమకి జుత్తు నెరిసిపోయింది. చర్మం ముడుతలు పడింది. పళ్ళూ, కీళ్ళూ సడలి పోతున్నాయి. తమకీ, ఆ చీరెకీ గల అనుబంధం సడలలేదు, ఇంకా. దాని మీద వ్యామోహం కాంతానికి రోజురోజుకీ ఎక్కువవుతున్నదే కాని తగ్గటంలేదు. కాంతం ఒంటి మీద లేని సమయాల్లో అది న్యూసుపేపర్ల రక్షణలో, పైన, క్రింద రెండు చీరెల నడుమ, నాఫ్తలిన్ ఉండల్ని తనలో పొదుపుకొని, సువాసనలీనుతూ ట్రంకుపెట్టెలో నిబ్బరంగా నివసిస్తుంది. ఆ చీరె కట్టుకున్నప్పుడు కాంతం తనకి కొత్త పెళ్ళికూతురులానే కనిపిస్తుంది. నునుసిగ్గులు వొలకబోస్తున్నట్టూ, చెంపలు కెంపులయినట్టూ, వాడి వత్తులైన ఆ కళ్ళు ఇంకా సొగసులీనుతున్నట్టూ; సెలయేటి గలగల, కోయిల కూత, ఎలమావి చిగురు మెత్తదనం, పున్నమి వెన్నెల్లో పారవశ్యం ఇవన్నీ స్ఫురణకి వచ్చి ఆ అనుభవాల కలగలుపు ఇచ్చే ఆనందంతో ఒళ్ళు తిమ్మిరెక్కినట్టవుతుంది!

కాంతం ఆ చీరెలో కనిపించితే తనివాళ ఎప్పట్లా ఆమెని చూడలేకపోయాడు. సంతోషంగా పలకరించలేక పోయాడు. సరసంగా ఒక చిన్న మాట మాట్లాడలేక పోయాడు!

కాంతాన్ని చూస్తే సుబ్బారావు పెళ్ళాం జ్ఞాపకం వొస్తోంది. కాంతంలో సుబ్బారావు పెళ్ళామే కనిపిస్తోంది! కాంతం వయసుదే ఆవిడ. అయినా కాంతంకన్నా చాలా అందమైనది. కాంతం ముఖానికి పూసుకున్న పసుపు ఆవిడ పూసుకో నక్కర్లేకుండానే, ఆ రంగులో కళకళలాడేది! వాళ్ళింటికి వెళ్తే లక్ష్మీదేవి దర్శనమయినట్టే అనుభూతి చెందేవాడు తను. ఇవాళ సుబ్బారావు పెళ్ళాంలో ఆ కళ మచ్చుకైనా లేకుండా పోయింది! అయితే ఆ కళ ఆవిడ ధరించిన కుంకుమ, గాజులు, మాంగల్యంతోనా వచ్చిందావిడికి? అవేనా ఆడదానికి అందం, అలంకారం? అవేనా కళా, కాంతీ? అవేనా సౌభాగ్యం? తను పోతూ, తన వెంట అవన్నీ తస్కరించుకు పోతూ, దైన్యాన్నీ, భ్రష్టత్వాన్నీ ఆవిడికి వదిలేసేడా, సుబ్బారావు? రేపు తను చనిపోతే కాంతం కూడా అంతేనా....?!

ఒళ్ళు జలదరించింది.

కాంతం నెమ్మదిగా వచ్చి, మంచంమీద పడుకున్న భర్తని సమీపించింది. శివరామయ్య ఆశ్చర్యంగా చూశాడు కాంతాన్ని. ఇందాక కట్టుకున్న ఆ కనకాంబరం పట్టు చీరె విప్పేసింది కాంతం. మరొక చీరె కట్టుకొంది. ఇందాకట్లా చిరునవ్వు నవ్వుతూ లేదావిడ వదనం. గాంభీర్యాన్ని సంతరించుకొని వుంది.

"ప్రొద్దున్నే ఎక్కడికంత కంగారుగా వెళ్ళారు?" అని అడిగింది.




''నేనప్పుడు పెరట్లో వున్నాను. 'ఎవరో మనిషి వచ్చి ఏదో చెబితే నాన్నగారు వున్న పాళంగా అతని వెంట వెళ్ళిపోయారు' అని అబ్బాయి చెప్పాడు నాకు. మాకేం అంతుబట్ట లేదు మీరెటు వెళ్ళారో, ఎంతాలోచించినా.''

''సుబ్బారావు చనిపోయాట్ట - అతని పెళ్లాం కబురుపెట్టింది నాకు వున్నపాళంగా రమ్మని'' అన్నాడు శివరామయ్య.

''ఆఁ—మీ స్నేహితులే?''

''ఆ—అవును....వాడే. సుబ్బారావే.''

ఎంత పనెంతపనయిందని కాంతం, విస్సూ, కోడలూ అనుకున్నారు. కాఫీ తెచ్చిస్తే శివ రామయ్య తీసుకోలేదు. భోజనానికి పిలిస్తే వెళ్ల లేదు. స్నానంలేదు. పానంలేదు. భార్యాపిల్లలూ బాధపడ్డారు. ఎవరెంత బ్రతిమాలినా, ''నన్ను బలవంతపెట్టకండి. నాకేం మనసు బాగాలేదు'' అని మంచంమీద, వెల్లకింతలా, దూలాన్ని చూస్తూ పడుకున్నాడు. మనసంతా అశాంతిగా గందరగోళంగా వుంది. సుబ్బారావు....తన ప్రాణస్నేహితుడు చచ్చిపోయే ఉన్న నిజం భరించరానిదిగానూ, ఆశ్చర్యంగానూ, వేదనా భరితంగానూ వున్నది, తనకి. కొద్ది రోజులు దగ్గరగావుండి విడిపోయే వాళ్ళే అట్లా విడిపోవలసి వచ్చినందుకు ఎంతో బాధ పడతారే! అట్లాంటిది తమ పరిచయం ఏనాటిది! ఒకటో క్లాసునించీ ఇంటరు దాకా ఇద్దరూకలిసి చదివేరు. సుబ్బారావు పోస్టలు డిపార్టు మెంటులో దూరాడు. తనకి గవర్నమెంటు గుమాస్తాగిరీ దొరికింది. ఉద్యోగాలయి, పెళ్ళిళ్ల యినవరకు ఇద్దరూ కొట్టుకున్నారు. తిట్టు కున్నారు. బాగా చిన్నతనంలో కొట్లాటలూ, కొంచెం పెద్దయ్యాక చిన్నచిన్న పోట్లాటలూ, మళ్ళీ కలిసి పోవటాలూ ఇవన్నీ ఆ ప్రమిత్రు లకు మామూలేగా!

చిన్నతనం నించీ సుబ్బారావు మాంచి బల మైన మనిషి. వాడికి క్రికెట్‌లో మంచి ప్రావీ ణ్యత వుంది. స్కూలు వార్షికోత్సవాలలో ఆటల బహుమతులే కాక కవిత్వంలో కూడా బహుమతులు పొందేవాడు. పదిహేనేళ్ళనించీ గేయాలల్లటం మొదలెట్టాడు. తన కవి చదివి వినిపించాకే ఏ పత్రికకయినా పంపేవాడు. ప్రకృతిని ఏ వేళప్పుడైనా ఏ కోణం నుంచ యినా చూచి పరవశించే రసహృదయం వుంది వాడికి. ఆ భాగ్యం అందరికీ అబ్బదు! వాడికి పాఠకలోకంలో వున్న పేరు ప్రఖ్యాతులు చూచి యింత గొప్పవాడు తన స్నేహితు డయినందుకు వుప్పొంగిపోయేవాడు తను. శలవరోజు వచ్చిందంటే చాలు! తను సుబ్బారా వింట్లో తిష్టవేసేడన్నమాటే!

ఆరువాటాలిల్లు సుబ్బారావుది. అందులో ముందరి వాటా రెండున్నర గదుల్ది సుబ్బారావు నివాసం.ముందు గది విజిటర్స్‌రూం, స్టోర్రూం, బెడ్‌రూం అంతా అదే! వెనగ్గది. వంట గది. ఆ వెనక బాత్‌రూం....

వాళ్ళింటికి వెళ్ళగానే గది ఇవతల చెప్పులు విడిచి, గదిలో రెండు కుర్చీలు వేసుకుని కూర్చుంటే దొర్లిపోయే ఆ కబుర్లకీ, గడిచి పోయే కాలానికీ అంతే వుండేదికాదు. అట్నించి ఇంటికి వెళ్తే మనసెంతో వుల్లాసంగా వుండేది. సుబ్బారావుకి ఒక్కడే పిల్లడు. వేణు బి. కాం. చదివి హైదరాబాదులో బ్యాంకులో పనిచేస్తు న్నాడు. ఇక్కడ సుబ్బారావూ, భార్యా ఇద్దరే నివాసం. రిటైరయ్యేక కొడుకు దగ్గిరికి వెళ్ళి పోవాలనుకుంటున్నానని సుబ్బారావనే వాడే కాని అల్లా వెళ్ళటం వాడికిష్టంలేదన్న సంగతి తనకి తెలుసు. ఈ వూరూ, పరిసరాలూ, చిన్న నాటి మిత్రులూ అన్నిట్నీ అందర్నీ వదిలేసుకు వాడెళ్ళిపోగలడా? అనుకున్నాడు తను.

తన వెర్రిగాని, ఇప్పుడీ లోకాన్నే వదిలే సేడే, సుబ్బారావు!

నిన్న సాయంత్రం తనతో పార్కులో కూర్చుని కబుర్లు చెప్పిన మనిషి ఇవాళ లేడు!! తెల్లార్తూనే సుబ్బారావు పెళ్ళాం ఆ వీధిలో వున్న వాళ్ళతో తనింటికి కబురు పెడితే పరి గెత్తాడు. ఆవిడె గుండెబాదుకు ఏడ్చింది. సుబ్బారావు కొడుక్కి వైరిచ్చేరు. ఆ అబ్బాయి వచ్చేదాకా శవాన్ని ఇంట్లో అట్టే పెట్టడానికి వీల్లేదని వాటాల వాళ్ళంతా అన్నారు.

వళ్ళు మండిపోయింది తనకి.

''కొన్ని గంటలు ఆగలేరయ్యా?........ ఇంతేనా మీరు సాటి మనిషికి ఇచ్చే విలువ?'' అని కోపంగా కేకలేశాడు.

సుబ్బారావు కొడుకు వేణు వచ్చేడు. దహన సంస్కారాలు పూర్తయ్యేయి.

నిన్నటివరకు తనతో రాసుకు పూసుకు తిరిగిన సుబ్బారావు శరీరం ఇవాళ బూడిదయి పోతూంటే చూడలేక కళ్ళు తిరిగినట్టయి, అక్కడ నిలవలేక యెలాగో యింటికి వచ్చి పడ్డాడు! వాడి ఆఖరి ఘడియలు గూర్చి వాడి భార్య చెప్పిన మాటలు పదే పదే చెవుల్లో సుళ్ళు తిరుగుతున్నయ్. నిన్న తను పార్కు నించిటురాగానే, వాడలా ఇంటికి వెళ్ళి భోజనం చేసి, కొంచెం ఆయాసంగా వుందని మాత్రం చెప్పి నడుం వాల్చేట్ట. ఆవిడ భోజనంచేసి, వంటగది చక్కబెట్టుకు వెళ్ళేసరికి నిద్రపోతు న్నట్టు కనిపించేట్ట. అర్థరాత్రివేళ గట్టిగా మూలిగి గుండెల్లో నొప్పోందంటూ భార్యని లేపి, ఆవిడ చేతుల్లో తల వాల్చేశాట్ట! దుక్క ముక్కలాంటి మనిషి? ఎప్పుడైనా ఓ రెండ్రో జులు జ్వరం తప్పితే మరే జబ్బూ ఎరగడు. అలాంటివాడు....!

శివరామయ్య మంచంలో యిబ్బందిగా కదిలాడు.

అసలు చచ్చిపోవటం అంటే ఏమిటి? ఈ శరీరాన్ని వదిలేయటమేనా? వదిలేసి ఎక్కడికి వెళతారు? ఆ జీవుడికి కళేబరాన్ని వదిలేశాక తనెవరో గుర్తుంటుందా? తన భార్యనీ, బిడ్డల్నీ, స్నేహితుల్నీ జ్ఞాపకముంచుకుంటాడా?వూఁహు ....అదెలా జరుగుతుంది? శరీరం ఒక మిషన్ లాంటిదంటారు డాక్టర్లు. ఏదో ఒక విల్ పవర్‌తో అది కొన్నాళ్ళు నడుస్తుంది. ఆగిపోయేక ఏం లేదు. నాడీచలనం నిల్చిపోతుంది. రక్తప్రసరణం ఆగిపోతుంది. కండరాలు కొయ్య కట్టుకుపోతాయి. అంతే! ఇహ ఆ కట్టెందుకూ పనికిరాదు. కాల్చివేయడం ఒక్కటే చేసేది.

ఇంతోటి బతుక్కి ఇన్ని వ్యామోహాలేవిటో!

ఏమిటి వుట్టిగట్టుకు పోవాలని ఈ తాపత్రయాలు?

మరణం ఒక్కటే మనిషి జీవితంలో యదార్థం.

అది వాడ్ని కబళించటానికి అనారోగ్యం, ఆరోగ్యం అడ్డురావు. దుక్కలాంటి సుబ్బారావే పోయాడు. గుండెజబ్బు మనిషి తను. తన బతుక్కి ఫికరేమిటి?

గుండెల్లో ఖరాలుమన్నట్టయి, "అమ్మా!" అని కేకవేశాడు శివరామయ్య. కాంతం, కొడుకూ, కోడలూ పరిగెత్తుకు వచ్చేరు. ఏమయిందేమయిందని మంచాన్ని చుట్టుముట్టేరు.

"ఏం లేదు....గుండెల్లో కాస్త నెప్పి వస్తే...." నసిగాడు.

"ప్రొద్దున్నించి అన్నం, నీళ్ళూ ఏమీ లేకపోతే నెప్పిరాదూ? లేచిరండి. వంటకాలన్నీ వెచ్చగా పొయ్యిమీద పెట్టి వుంచేను. మీకు తోచినంతే తిందురుగాని. రండి" అంది కాంతం.

ఆవిడ కళ్ళలో ఆదుర్దా....భయం!

"రండి, నాన్నా. అసలే జబ్బు మనుషులు. ఏం కడుపులో వేసుకోకపోతే మరీ ప్రమాదం" అన్నాడు విస్సు. అతడి వదనంలో ఆందోళన! ఆరాటం!



"సుబ్బారావు చచ్చిపోతే ఏమయింది? నేను పోతే ఏమవుతుందర్రా........" వెర్రివాడిలా మాట్లాడుతున్నాడు శివరామయ్య.

వాళ్ళు గుడ్లనీళ్ళు కుక్కుకుంటూ నించున్నారు.

వాళ్ళనింక బాధించలేక శివరామయ్య వెళ్ళి విస్తరిముందు కూచున్నాడు. అరగంట కూచున్నాడుగాని నాలుగు మెతుకు నోట్లోకి వెళ్ళలేదు. చెయ్యి కడిగేసుకుని "చూసేవా నాకు ఏం తినాలని లేదంటే విన్నారు కాదు" అన్నాడు.

వెళ్ళి గదిలో పడుకున్నాడు. నేడో, రేపో తనూ రాలిపోతాడు. ఈ దేహాన్నింక పోషించాలని లేదుగాని, వీళ్ళు మమకారాలతో కట్టేసి పడేస్తున్నారు. తనే మరణించిన్నాడు కాంతం ఏమైపోతుంది? ఒక్కరోజు తను భోజనం మానేసినందుకే వాళ్ళు తల్లడిల్లి పోతున్నారే! వీళ్ళని వదిలేసి యెల్లా వెళ్ళిపోతాడు?

తిండిలేకో, స్వతహా జబ్బుమనిషి అయినందున స్నేహితుడి మరణంతో మనసు క్రుంగిపోయి, ఆ ఆలాపనతో అలిసినందునో గుండెనెప్పి ఉధృతమయింది. శివరామయ్య భయపడ్డాడు. భార్యని పిలిచి యిలా నెప్పిగా వుందని చెప్పలేక, మానలేక అవస్థపడ్డాడు. మృత్యుదేవత ఆ గదిలో తిరుగాడుతున్నట్టూ, ఏక్షణాన్నయినా తనని, తనలో ఐక్యం చేసుకోబోయేట్టు అనిపించింది. భయంతో బిగుసుకుపోయాడు. కళ్ళు మూసుకుంటే మరణించిన తన బంధువులు, వాళ్ళ మధ్య స్నేహితుడు సుబ్బారావు కనిపించి తననీ 'రా! రా!' అని ఆహ్వానిస్తున్నట్టు అయి ఒళ్ళంతా చెమట్లు పట్టేసింది. చిన్న కేక పెట్టాడు. కాంతం దగ్గరికి వచ్చింది. కళ్ళు పూర్తిగావిప్పి కిటికీలోంచి అవతలికి చూశాడు. రాత్రి అయినట్టు నల్లని ఆకాశంతో అక్కడక్కడా చుక్కలు మినుకు మినుకు మంటున్నాయి. శివరామయ్య భార్య చెయ్యి పట్టుకుని ఆవిడ కళ్ళల్లోకి ప్రాధేయతగా చూస్తూ, "కాంతం ఒక్కమారు ఆ చీరె కట్టుకో" అన్నాడు. కాంతం ఆశ్చర్యంగా చూసింది.

"ఇప్పుడిదేం కోరికండీ........వేళకాని వేళ...."

"ఒక్కమారు నిన్నా చీరెలో చూడాలని వుంది, కాంతం. తెల్లవారి లేస్తానో లేవనో తెలియదు....కట్టుకోవూ? మళ్ళీ నిన్నా చీరెలో చూస్తానో చూడనో...."

ఆయన పట్టుదలతో కాంతాని కారాత్రి కనకాంబరం రంగు పట్టుచీరె కట్టుకోక తప్పింది కాదు. ఆవిడ చీరె చెరగులో ముఖం దాచుకున్నాడు శివరామయ్య, పసివాడిలా. తెల్లవారి తనవాళ్ళందరి ముఖాలు చూచినవరకు అతని గుండె బెదురు తగ్గలేదు.

——:o:——